క్లుప్తంగా

ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి


కొత్తపల్లి మురళీకృష్ణ

దెందులూరు: ఎంఆర్‌పీఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి మురళీకృష్ణ నియమితులయ్యారు. గురువారం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ ఈ మేరకు లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. మురళీకృష్ణ నియామకంపై జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగల శేఖర్, ఎంఎస్‌పీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

గురు శర్మకు సాహితీ సంబరాల ఆహ్వానం


గురు శర్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సాహితీ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమంగా మే నెల 10, 11 తేదీల్లో ఏలూరులో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు నగరానికి చెందిన కవి గురు శర్మకు ఆహ్వానం అందింది. శ్రీశ్రీ కళావేదిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కవిగా, రచయితగా, వాఖ్యాతగా అనేక రికార్డులు సొంతం చేసుకున్న గురు శర్మకు ఆహ్వానం అందడం సముచిత నిర్ణయమని నగరానికి చెందిన సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తమ రావు, గరికపాటి ఆర్ట్స్ థియేటర్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు, సినీ విజ్ఞాన విశారద ఎస్‌వీ రామారావు అభినందించారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

జంగారెడ్డిగూడెం: ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ గ్యారేజ్ గేటు వద్ద డిమాండ్లతో కూడిన ప్లకార్డులతో ఆర్టీసీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపో ప్రెసిడెంట్ ఎస్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ 38 డిమాండ్లపై యాజమాన్యం స్పందించకపోవడంతో మూడో దశ పోరాటంలో భాగంగా నిరసన వ్యక్తం చేయాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్, రిమూవర్లను వెంటనే ఆపాలని, ఆగిపోయిన ప్రమోషన్స్ ఇవ్వాలని, గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ముక్కు మూసుకోవాల్సిందే!

- ఏలూరు టూటౌన్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- హోటల్స్, రెస్టారెంట్ల ప్రాంతాల్లో మరీ అధ్వానం
- వారానికి ఒకసారైనా పాటించని శుభ్రత
- అడిషనల్ కమిషనర్ ఇన్‌చార్జిగా ఉన్నా మొక్కుబడి పనులే


దుర్గంధం వెదజల్లుతున్న పత్తేబాద రైతు బజార్ వెనుక ప్రాంతం

ఏలూరు (టూటౌన్): ఏలూరు టూటౌన్ ప్రాంతంలో డ్రెయినేజీల నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. హోటల్స్, రెస్టారెంట్లు ఉన్న ప్రాంతాల్లో పాదచారులు, వాహనచోదకులు ముక్కుమూసుకొని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ డ్రెయిన్లను కనీసం వారానికి ఒకసారైనా శుభ్రం చేయకపోవడంతో పూడుకుపోతున్నాయి. వర్షం పడితే చాలు డ్రెయిన్లలో మురుగు రోడ్లపైకి చేరుతుంది. ఒక్కోసారి డ్రెయిన్లలో సిల్టు తీసి రోడ్డు పక్కనే వేసి రెండు, మూడు రోజులకు కూడా తీయకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అడిషనల్ కమిషనర్ ఇన్‌చార్జిగా పర్యవేక్షిస్తున్నా రెండో పట్టణ ప్రాంతంలోనే పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటే మిగతా ప్రాంతాల్లోని పరిస్థితి ఏమిటంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పూడుకుపోతున్న డ్రెయిన్లు

రెండో పట్టణ ప్రాంతంలో హోటల్స్, రెస్టారెంట్లు ఎక్కువగా ఉన్నాయి. వీటి నుంచి వచ్చే వ్యర్థాలను నేరుగా వదిలేయడంతో డ్రెయిన్లు పూడుకుపోతున్నాయి. వీటిలో నగరపాలక సంస్థ సిబ్బంది పూడిక తీసినా తిరిగి కొన్నిరోజులకే పూడుకుపోతున్నాయి. షాపుల ఎదుట డ్రెయినేజీపై రాళ్లు లాంటివి వేసి మూసివేస్తున్నారు. దీంతో డ్రెయిన్లు వ్యర్థాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, టి కప్పులు వంటి వాటితో నిండిపోతున్నాయి. మురుగు ముందుకు పారక ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. ఆయా ప్రాంతాలు కొన్ని రోజుల్లోనే దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఐతే దుకాణదారులు, హోటల్స్, రెస్టారెంట్ల వారు నెలవారీ మమూళ్లు ఇస్తుండడంతో పారిశుద్ధ్య, కార్పొరేషన్ సిబ్బంది మిన్నకుండిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇష్టానుసారం వ్యర్థాలను డ్రెయిన్లలోకి వదిలే హోటల్స్, రెస్టారెంట్లపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు.


ఆర్‌ఆర్‌పేటలో ఒక రెస్టారెంట్ వద్ద పూడుకుపోతున్న డ్రెయినేజీ


విజయవిహార్ సెంటర్‌లోని ఎస్‌బీఐ వద్ద డ్రెయినేజీ ఇలా..

పర్యవేక్షించేవారేరీ?

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఎంహెచ్‌ఓ పోస్టు గత కొంతకాలంగా ఖాళీగా ఉంది. దీంతో ఏలూరు టూటౌన్ ప్రాంతాన్ని ఏసి చంద్రయ్య, వన్‌టౌన్ ప్రాంతాన్ని డీసీ శివారెడ్డిలు పర్యవేక్షిస్తున్నారు. అయితే వీరు ఎక్కడా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయకపోడంతో పారిశుద్ధ్యం ఎక్కడికక్కడ పడకేసిందని ప్రజలు వాపోతున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి



ప్రస్తుత వేసవిలోనే నగరంలోని అన్ని మురుగు డ్రెయిన్లను శుభ్రంచేసి మెరుగుపర్చాలి. వర్షాకాలం నాటికి డ్రెయిన్లన్నింటినీ శుభ్రం చేస్తే బాగుంటుంది. లేనిపక్షంలో వర్షాకాలంలో కొద్దిపాటి చినుకులకే మురుగు నీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతుంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి.

– బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు, ఏలూరు

కాంట్రాక్టు సిబ్బందిని నియమించాలి



నగరంలో పారిశుద్ధ్య సిబ్బంది సరిపోని పక్షంలో కాంట్రాక్ట్ విధానంలో మరికొందరిని నియమించుకోవాలి. తద్వారా నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం మెరుగు పడే అవకాశం ఉంటుంది. అధికారులు సైతం నిత్యం పర్యవేక్షణ చేయడంతో పాటు పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– జి.గోపి, సీఐటీయూ నగర నాయకులు, ఏలూరు

జెడ్పీ అతిథి గృహ ప్రహరీ ప్రారంభం


ప్రహరీని ప్రారంభించిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్ అతిథి గృహ ప్రహరీని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ జనరల్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో 70 మీటర్ల పొడవైన ప్రహరీని నిర్మించామని పద్మశ్రీ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎంవీ రమణారావు, డీఈ జె.శ్రీనివాస్, డీఆర్‌ఐ డీఈ శ్రీనివాస్, ప్రాజెక్ట్ డీఈ సురేష్, జిల్లాలోని జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఎదుగుదల


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఎప్పటికప్పుడు పోషకాహారం అందించినప్పుడే వారిలో వయస్సుకు తగిన విధంగా ఎదుగుదల, బరువు, హిమోగ్లోబిన్ వంటివి ఉంటాయని ఏలూరు ప్రాజెక్టు అధికారిణి విజయలక్ష్మి అన్నారు. స్థానిక శనివారపుపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోషకాహారం అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలపైనా ఉందన్నారు. సూపర్ వైజర్ బి.మంగ, ఏఎస్ఎం ప్రభావతి, అంగన్‌వాడీలు కె.నాగమణి, టి.జయలక్ష్మి, ఎంవీ నరసమాంబ, టి.సుభాషిణి, పి. మార్తమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉద్యోగాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌రెడ్డి పీజీ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 65 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని లారస్ ల్యాబ్స్ సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ హెచ్‌ఆర్ డి.సునీత తెలిపారు. వీరంతా విశాఖపట్నం, హైదరాబాద్ బ్రాంచ్‌లలో పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నా రు. వీరిని సీఆర్ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు అభినందించారని తెలిపారు.

కాపు నేత హరికృష్ణకు జేపీ పరామర్శ


హరికృష్ణను పరామర్శిస్తున్న జయప్రకాష్, నాయకులు

ఏలూరు (టూటౌన్): ఇటీవల ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏలూరు నగర కాపు నాయకుడు జల్లా హరికృష్ణను వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పరామర్శించారు. అదేవిధంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న పార్టీ నేత కుంచాడ శ్రీనివాసు భార్యను పరామర్శించారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న నాయకులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జేపీ వెంట పార్టీ నాయకులు గుడిదేశి శ్రీనివాసు, నేరుసు చిరంజీవి, జాన్ గుర్నాథ్, కొల్లిపాక సురేష్, సైదు కొండ, సునీల్, ఫణి, రామకృష్ణ, తంగిల రాము, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వృద్ధుల ఆశ్రమంలో సదుపాయాలపై ఆరా


వృద్ధురాలితో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): స్థానిక పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ గురువారం సందర్శించారు. ఇక్కడ వృద్ధులకు అందుతున్న వసతులు, ఆహార పదార్థాల నాణ్యత, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. వృద్ధులతో మాట్లాడారు. న్యాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందని, సంక్షేమ పథకాలను పొందడంలో ఉన్న సమస్యలను అర్జీ రూపంలో ఇచ్చిన సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని రత్నప్రసాద్ తెలిపారు. పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రస్తుతం ఎక్కువగా ఉన్న దోమలు బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అగ్నిమాపక వారోత్సవాలు

జంగారెడ్డిగూడెం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్థానిక ఇండియన్ స్కూల్‌లో అగ్నిమాపక అధికారులు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాద సమయంలో ఫైర్ ఎక్స్‌టిన్‌గ్విషర్ ఎలా ఉపయోగించాలో వివరించి విద్యార్థులతో చేయించారు. అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి జి.అబ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

అడుగంటిన చెరువులు

335 అడుగులకు చేరిన తమ్మిలేరు నీటిమట్టం


నాగిరెడ్డిగూడెం వద్ద తగ్గిన తమ్మిలేరు రిజర్వాయర్ నీటిమట్టం

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుతో పాటు చెరువుల నీటి మట్టాలు తగ్గుముఖం పట్టాయి. గతేడాది తొలకరిలో భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులు పూర్తిగా నిండాయి. ఆ తరువాత సరైన వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలమట్టం నానాటికి పడిపోతోంది. ఏప్రిల్ నెలలో ఎండలు మండిపోతుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. భూగర్భ జలాలపై ఆధారపడిన మెట్ట ప్రాంతంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో చెరువులు ఎండి పోవడంతో పశువులు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టుల్లో నీరు ఉంటే భూగర్భజలాలు ఇంత దారుణంగా కిందికి పడిపోయే ప్రమాదం ఏర్పడేది కాదన్నది నిపుణుల అభిప్రాయం.

తగ్గుతున్న భూగర్భ నీటిమట్టం

చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం సమీపంలో మూడు టీఎంసీల సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించారు. ప్రాజెక్టు క్రింద ఏలూరు జిల్లాలో 4,200 ఎకరాలు, ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లాలో 4,969 ఎకరాలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో నీరుంటే చుట్టు పక్కల మండలాల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయి. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 355 అడుగులు. ప్రస్తుతం ప్రాజెక్టులో 335 అడుగులకు చేరింది. దీంతో పలు గ్రామాల్లో భూగర్భ నీటిమట్టం తగ్గు ముఖం పడుతోంది. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తే మెట్టకు సాగునీటి కష్టాలు తప్పుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చింతలపూడి ఎత్తిపోతలను పూర్తిచేయాలి



టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలు కావస్తోంది. ఇంతవరకు చింతలపూడి పథకానికి నిధులు కేటాయించలేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని తక్షణం పూర్తి చేయాలి. అదేవిధంగా జపాన్ ఆర్థిక బ్యాంక్ (జైకా) నుంచి వచ్చిన నిధులతో తమ్మిలేరు మరమ్మతు పనులు ప్రారంభించి ఈ వేసవిలోనే పూర్తి చేయాలి.

– బొద్దు వెంకటేశ్వర్రావు, వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-08
వంకాయలు (గులాబీ)	22	చిక్కుడు కాయలు	00
వంకాయలు (కాంతులు)	28	బీన్సచిక్కుడు	70
వంకాయలు (తెలుపు)	28	చామదుంపలు	54
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	76
కాకర కాయలు	30	బీట్‌రూట్	30
బీరకాయలు	34	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	38	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	18	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	29

నీటి ప్రవాహానికి అడ్డంకులు

కడెమ్మ కాలువలో పెరిగిన తూడు, తుప్పలు


కడెమ్మ కాలువలో పెరిగిన మొక్కలు, తూడు

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో అతిపెద్ద సాగునీటి చెరువు కొత్తూరు చెరువు. ఇందులో కొమ్ముతిరిగిన నీటితో పాటు కొండ వాగుల నీరంతా కడెమ్మ కాలువ ద్వారా ప్రవహించి కడెమ్మ స్లూయిజ్ నుంచి గోదావరి నదిలోకి చేరుతుంది. సుమారు మూడు కిలోమీటర్ల పొడవున ప్రవహించే కడెమ్మ కాలువ కొన్నేళ్లుగా మరమ్మతులకు కూడా నోచుకోలేదు. దీంతో కాలువలో గుర్రపు డెక్క, తూడు, మొక్కలు పెరిగిపోయాయి. కాలువ మధ్యలో ఇసుక మేటలు వేశాయి. ఇవి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. వర్షాకాలంలో కొండవాగుల నీరు ఉధృతంగా ప్రవహించి పంట పొలాలు ముంచెత్తుతుంది. గోదావరి వరద పెరిగినప్పుడల్లా కడెమ్మ స్లూయిజ్ ద్వారా వరద నీరు ఎగపోటుకు పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో వరి పొలాలు దెబ్బతినడం పరిపాటిగా మారింది.

కాలువలోకి జారుతున్న మట్టి

కడెమ్మ స్లూయిజ్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు నుంచి వర్షాకాలంలో మట్టి జారిపోవడంతో కాలువ పూడుకుపోతుంది. దీంతో నీరు కూడా గోదావరిలోకి చేరడం లేదు. కాలువ వెడల్పు చేసి జంగిల్ క్లీనింగ్, డి సిల్టింగ్ పనులు చేస్తే సాగు నీరు అందడంతో పాటు ముంపు ముప్పు తప్పుతుందని, కడెమ్మ కాలువ మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు. సమస్యను మైనర్ ఇరిగేషన్ డీఈ వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా కడెమ్మ కాలువలో జంగిల్ క్లీనింగ్, డీసిల్టింగ్ పనులు చేపట్టేందుకు రూ.10 లక్షలతో ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు చెప్పారు. నిధులు మంజూరైతే పనులు చేపడతామని వివరించారు.

ఆరోగ్యవంతమైన ఆహారం అందించాలి


ద్వారకాతిరుమలలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: బాలింతలు బిడ్డకు ఆరోగ్యవంతమైన ఆహారం ఇవ్వడంతో పాటు, శారీరక శుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి సూచించారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార లోప నివారణకు చేపట్టాల్సిన చర్యలపై గర్భిణులు, బాలింతలకు మేరి అవగాహన కల్పించారు. బిడ్డకు తల్లి ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించాలన్నారు. గర్భిణులు కనీస రెండు సార్లు నులిపురుగుల నివారణ మందు ఆల్బెండజోల్ వేసుకోవాలని సూచించారు. సచివాలయ మహిళా పోలీస్ లక్ష్మీ సుజన, ఏఎన్ఎం మోహిని మాట్లాడుతూ గర్భిణీ 180 ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడితే ప్రసూతి తర్వాత త్వరగా కోలుకుంటారని తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

గణపవరం: విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, మానసిక పరివర్తనకు దోహదపడే ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని ఎంఈఓ గొర్రెల బాలయ్య అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన 2025 సంవత్సరానికి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభించారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. 'ప్రభుత్వ బడిని కాపాడుకుందాం.. ప్రైవేటుబడులు వద్దు.. ప్రభుత్వ బడులు ముద్దు' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఎంఈఓ బాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యార్హతలున్న ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా వసతులు ఉన్నాయని వివరించారు.

లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

ఏలూరు (టూటౌన్): చిన్న తరహా పరిశ్రమలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. ఏలూరులో గురువారం జరిగిన పూర్వ పశ్చిమ గోదావరి జిల్లా, జిల్లాపరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఆయన పాల్గొని వివిధ సమస్యలను ప్రస్తావించారు. తణుకు మండలం తేతలి గ్రామంలో ఉన్న పశువధ కర్మాగారానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోకుండా పోలీసులతో భయబ్రాంతులు చేయడం దారుణమన్నారు. రవాణా, పశుసంవర్ధక, పొల్యూషన్ శాఖ సంయుక్తంగా సమస్యలను తెలుసుకొని చుట్టుప్రక్కల ప్రజలను కర్మాగారం లోపలికి తీసుకెళ్లి వాస్తవాలను తెలియజేయాలన్నారు. పశువధ చట్టం నిబంధనను వివరించారు. తగిన ట్రీట్మెంట్ పరిస్థితి లేకపోతే కర్మాగారాన్ని వేరే ప్రాంతాలకు తరలించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. ముఖ్యమంత్రి వచ్చి స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర ప్రారంభించిన ప్రాంతాల్లో పంచాయతీ అధికారులు ఈ విధంగా చేయడం ఏమిటని ప్రశ్నించారు.